క్లుప్తంగా

అన్నదానం ట్రస్టుకు విరాళం



చెక్కు అందజేస్తున్న దాత

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలోని అన్నదానం ట్రస్టుకు గురువారం గుంటూరుకు చెందిన ప్రత్యూష కుటుంబం రూ.1,00,116 విరాళంగా ఇచ్చారు. విరాళ నగదును చెక్కు రూపంలో ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం వారికి అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోవాలి



శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

యాదమరి(పూతలపట్టు): మండలంలోని కోనాపల్లిలో గురువారం నిర్వహించిన 104 సంచార వైద్యశిబిరానికి మంచి స్పందన లభించింది. రోగులను పరీక్షించి మందులు అందజేశారు. అలాగే బీసీజీ వ్యాక్సిన్లు వేశారు. వైద్యులు మాట్లాడుతూ యుక్త వయసులో ఉన్నవారికి ఎక్కువ శాతం క్షయ వ్యాధి వస్తున్నదని, ఈ వ్యాధిని అరికట్టాలంటే బీసీజీ వ్యాక్సిన్‌ను వేయించుకోవాలన్నారు. ఈ వ్యాక్సిన్‌ను 24 గంటల్లోపు పుట్టిన చిన్నారికి, 60 సంవత్సరాలు నిండిన వారికి మొదట విడత వేసే కార్యక్రమం చేపట్టామన్నారు. వ్యాక్సిన్ వేసుకోవడంతో క్షయవ్యాధి బారిన పడే అవకాశం తగ్గుతుందని తెలిపారు. వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

యాంటీ రేబిస్ టీకాలు వేయించాలి

బంగారుపాళెం: పెంపుడు కుక్కలకు టీకాలు వేయించాలని బంగారుపాళెం ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ ఆసిఫ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6వ తేదీ ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా స్థానిక పశువైద్యశాల ఆవరణలో కుక్కలకు రేబిస్ వ్యాధి సోకకుండా యాంటీ రేబిస్ టీకాలు(ఏఆర్‌వీ) వేయనున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి టీకాలు వేస్తామన్నారు. అదేవిధంగా జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే జునోటిక్ వ్యాధులపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం




వైద్య సేవలందిస్తున్న డాక్టర్ పూర్ణలత

ఐరాల: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. మండలంలోని ఇరువారంపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 70 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. సీజనల్ వ్యాధులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. వర్షాకాలంలో చిన్నారుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. దోమ కాటుతో ప్రాణాంతక వ్యాధులు సంభవించే అవకాశం ఉందన్నారు. హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా వంగవీటి జయంతి

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరంలోని గాంధీ విగ్రహం వద్ద గురువారం బలిజ సంఘ ఆధ్వర్యంలో వంగవీటి మోహన రంగా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే గురజాల వంగవీటి చిత్రపటానికి నివాళులర్పించారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో బలిజ సంఘ నేతలు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న చిరంజీవి

బంగారుపాళెం: మండలంలోని నలగాంపల్లె పంచాయతీ ఎన్‌పీ నగర్‌కు చెందిన ఓ వ్యక్తి గురువారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్ఐ మల్లప్ప తెలిపారు. గ్రామానికి చెందిన చిరంజీవి(41) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత కొంతకాలంగా చిరంజీవి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో మనస్తాపానికి గురై ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు ఈ విషయాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దాంతో ఏఎస్ఐ మల్లప్ప, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాళెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రాగి సాగు.. లాభాలు బాగు

- రాగి సంగటి, రాగి జావపై మక్కువ చూపుతున్న ప్రజలు
- మార్కెట్‌లో డిమాండ్ పెరగడంతో ఆశాజనకంగా ధరలు



ఎన్.కోటూరులో సాగు చేసిన రాగిపంట

బంగారుపాళెం: ప్రధాన ఆహార పంటల్లో రాగి పంట ఒకటిగా చెప్పవచ్చు. చిరు ధాన్యం పంటగా రాగులను పండిస్తారు. ఖరీఫ్, రబీ సీజన్లతో పాటు వేసవిలో కూడా రాగి పంట సాగు చేస్తారు. రాగిలో కాల్షియం అధికంగా ఉంటుంది. కొవ్వు పదార్థాలు తక్కువగా ఉండడం, పీచు పదార్థం కావడం, వరి, గోధుమ కంటే పోషకాల శాతం ఎక్కువ ఉండడంతో ఇటీవల కాలంలో మంచి పౌష్టికాహారంగా రాగిని గుర్తించి ప్రజలంతా వాడుతున్నారు. దీంతో గతంలో తక్కువగా ఉండే రాగి పంట విస్తీర్ణం ప్రస్తుతం పెరిగింది. ప్రభుత్వాలు కూడా రాగి పంటకు మద్దతు ధర కల్పించడంతో రైతులు లాభాలు పొందుతున్నారు.

రాగులకు మంచి గిరాకీ

నియోజకవర్గంలో రైతులు చిరు ధాన్యాల పంటల సాగుపై దృష్టి సారించారు. ముఖ్యంగా రాగి పంట సాగుపై ఆసక్తి చూపుతున్నారు. నీటి తడులకు అవకాశం ఉన్న రైతులు రాగి పంటతో పాటు వేరుశనగ సాగు చేస్తున్నారు. ప్రస్తుతం రాగులకు మంచి గిరాకీ ఉంది. గతంలో గ్రామాల్లో రాగి, జొన్న, సజ్జ, కొర్ర, సామ, అరిక పంటలు సాగు చేసేవారు. క్రమంగా ఆయా పంటల సాగు తగ్గుతూ వచ్చింది. ప్రస్తుతం కొన్ని గ్రామాల్లో రాగులు, కొర్రలు సాగు చేస్తున్నారు. గ్రామాల్లో మధ్యాహ్నం రాగి సంగటి వాడుతున్నారు. హోటళ్లలో కూడా రాగి సంగటి అందుబాటులో ఉంటోంది. షుగర్ వ్యాధిగ్రస్తులు ఎక్కువగా రాగి సంగటి తినడానికి ఇష్టపడుతున్నారు. దీంతో రాగులకు డిమాండ్ పెరిగింది. వరి కోసిన తరువాత రాగిపంట సాగు చేస్తున్నారు. రాగులు కిలో రూ.30 నుంచి రూ.40 వరకు ధర పలుకుతున్నాయి. దీంతో రాగి పంట సాగుతో మంచి లాభాలు రాబడుతున్నారు.

అధిక దిగుబడినిచ్చే రకాలు

రాగి పంటలో అధిక దిగుబడినిచ్చే రకాలలో మేలైన రకం మారుతీ రకం. ఈ రకం పంట 85 రోజుల నుంచి 90 రోజుల్లో దిగుబడికి వస్తుంది. తెగుళ్లను తట్టుకుని 10 క్వింటాళ్ల వరకు దిగుబడినిస్తుంది. అన్ని ప్రాంతాల్లో సాగు చేసేందుకు వీలుగా ఉంటుంది. వేగావతి, సువర్ణముఖి, వకుళ, భారతి, హిమ, శ్రీచైతన్య రకాలు కూడా అధిక దిగుబడినిస్తాయి.

విత్తనశుద్ధి ఇలా..

రాగి పంట సాగు చేసే సమయంలో విత్తనశుద్ధి అవసరం. కిలో విత్తనానికి 2 గ్రాముల కార్బండిజం అనే మందు కలిపి విత్తనశుద్ధి చేయడం ద్వారా పంటకు తెగుళ్లు సోకకుండా ఉంటాయి. నారు నాటే పద్ధతిలో అయితే ఒక ఎకరానికి నారు కావాలంటే 2 కేజీల విత్తనాన్ని 5 సెంట్ల భూమిలో నారుమడిలో పోయాలి. 21 రోజుల తరువాత నారుని పొలంలో నాటాలి. పొలం దున్నిన తరువాత ఆఖరి దుక్కిలో మూడు నుంచి నాలుగు టన్నుల పశువుల ఎరువులు వాడాలి. ఖరీఫ్‌లో వర్షాధారంగా పండించే రాగి పంటకు 24 కిలోల నత్రజని, 12 కిలోల భాస్వరం, 8 కిలోల పొటాషియం వేయాలి. అగ్గి తెగుళ్ల నివారణకు ట్రైసైక్లోజెల్ 6 గ్రాములను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. వెర్రి తెగులు నివారణకు 2 గ్రాముల మెటలాక్సిల్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. కాండం తొలిచే పురుగు నివారణకు కొరాజిన్ 3 మి.లీటర్లను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఈ విధంగా పంట సస్యరక్షణ చేస్తే పంట అధిక దిగుబడి వస్తుందని వ్యవసాయ అధికారులు వెల్లడిస్తున్నారు.

రాగులతో ఆరోగ్యం

రాగులను ఆహారంగా తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చు. రాగులతో చేసే సంగటి, రాగి జావ, రొట్టె తీసుకోవడం ఎంతో మంచిది. రాగులు 100 గ్రాములు తీసుకుంటే, అందులో 344 మిల్లీ గ్రాముల కాల్షియం, 328 క్యాలరీలు, 3.6 గ్రాముల పీచు పదార్థాలు, 7.3 గ్రాముల ప్రొటీన్ లభిస్తుంది. అందుకే పూర్వం ఎక్కువగా రాగులతో చేసిన పదార్థాలే తినేవారు. రాగి జావ వలన రక్తంలో గ్లూకోజ్ స్థాయి అదుపులో ఉంటాయి. రాగులు వాడడం వలన బరువు తగ్గుతారు.

ధైర్యానికి ప్రతీక అల్లూరి



చిత్తూరు: పీవీకేఎన్‌లో అల్లూరికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

చిత్తూరు కలెక్టరేట్: అల్లూరి సీతారామరాజు ధైర్యానికి ప్రతీక అని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు గోపినాయక్ అన్నారు. బుధవారం ఆ కళాశాలలో అల్లూరి జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం సాయుధ పోరాట మార్గాన్నెంచుకుని, పరిమితమైన గిరిజన యోధులతోనే బ్రిటీష్ పాలకులను గడగడలాడించిన మన్యం వీరుడని చెప్పారు. హిస్టరీ లెక్చరర్ రెడ్డి బాషా, ఎకనమిక్స్ లెక్చరర్ రాజేష్ పాల్గొన్నారు.

అల్లూరిని ఆదర్శంగా తీసుకోవాలి

బంగారుపాళెం: స్వతంత్ర పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజును యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వందనా త్రిపాఠి అన్నారు. స్థానిక జూనియర్ కళాశాలలో గురువారం అల్లూరి సీతారామరాజు జయంతిని విద్యార్థులు, అధ్యాపకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూజలు చేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడానికి సీతారామరాజు చేసిన పోరాటం గొప్పదన్నారు. విద్యార్థులు సీతారామరాజును స్ఫూర్తిగా తీసుకుని సమాజంలో జరిగే అన్యాయం, దురాగతాలను అడ్డుకోవాలని సూచించారు. యువతతోనే సమాజం అభివృద్ధి సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ మురళి, అధ్యాపకులు పాల్గొన్నారు.



బంగారుపాళెం: మాట్లాడుతున్న ప్రిన్సిపల్ వందనా త్రిపాఠి

పీఎఫ్ సమస్యలు పరిష్కరించాలి



సీఈఓ గ్లోరియాకు వినతిపత్రం ఇస్తున్న నేతలు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు పీఎఫ్ సమస్యలను పరిష్కారించాలని జెడ్పీ సీఈఓ గ్లోరియాను ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు వినతి చేశారు. గురువారం జెడ్పీ సీఈఓ కార్యాలయంలో ఆమెను కలిసి మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న వార్షిక పీఎఫ్ స్లిప్‌లను వడ్డీ సహా లెక్కించి విడుదల చేయాలన్నారు. మిస్సింగ్ క్రెడిట్స్ ఏవైనా ఉంటే మండలాలకు సమాచారం అందించి షెడ్యూల్స్‌ను తెప్పించుకుని సరిచేయాలన్నారు. సకాలంలో రికవరీ, నాన్ రికవరీ లోను ఫైనల్ పేమెంట్ వాటిని సకాలంలో విడుదల చేయాలన్నారు. దరఖాస్తు చేసుకున్న తేదీ నుంచి నెలలోపు పీఎఫ్ ఖాతాదారులకు ఆ మొత్తాన్ని చెల్లించే విధంగా కృషిచేయాలని ఆయన తెలిపారు. మిస్సింగ్ క్రెడిట్స్ కోసం ఈనెలలో స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేయాలని చెప్పారు. మూడు నెలలకు ఒకసారి ఉపాధ్యాయ సంఘాలతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసే విధంగా చూడాలని కోరారు.

నేడు కౌన్సిల్ సాధారణ సమావేశం

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు నగర మేయర్ ఎస్ అముద ఒక ప్రకటనలో తెలిపారు. నగర పాలక కౌన్సిల్ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి ఎక్స్ అఫిషియో సభ్యులు, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు హాజరు కావాలని ఆమె పేర్కొన్నారు.

ఎన్టీఏ వ్యవస్థను రద్దు చేయాలి

చిత్తూరు కలెక్టరేట్: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) జాతీయస్థాయి పరీక్షలను నిర్వహించడంలో విఫలమైందని ఐక్య విద్యార్థి సంఘాల చైర్మన్ సద్దాం ఆరోపించారు. గురువారం నగరంలో నిర్వహించిన విద్యాసంస్థల బంద్ సందర్భంగా పలు విద్యాసంస్థలను మూసివేయించి మీడియాతో మాట్లాడారు. ఎన్టీఏ వ్యవస్థను రద్దుచేసి, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల నెట్, నీట్ పరీక్షలు రాసి నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పరీక్షలు రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలన్నారు. ముంబై ఐఐటీ నుంచి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వరకు విద్యార్థి సంఘ నేతలపై అక్రమ కేసులను ఎత్తివేయాలన్నారు. నీట్ పరీక్ష విధానాన్ని రద్దు చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు.

ఆర్‌వీఎస్ ఆస్పత్రి తనిఖీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగర పరిధిలోని ఆర్‌వీఎస్ ఆస్పత్రిని గురువారం రాత్రి డీఎంహెచ్ఓ ప్రభావతిదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, ఆస్పత్రి పనితీరును పరిశీలించారు. పేద ప్రజలకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యాన్ని అందించాలని, ఈ విషయంలో ఎలాంటి లోటు ఉండకూడదని ఆదేశించారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలు



జొన్నగురకలలో వృద్ధులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్

తవణంపల్లె: పేదలకు మెరుగైన వైద్య సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యమని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. గురువారం మండలంలోని నలిశెట్టిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మోహన్‌వేలు రోగులకు వైద్య పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక పరీక్షలు చేయించి, ఉచితంగా మందులు అందజేశారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచుకోవాలని సూచించారు. ఫ్రైడే డ్రైడే పాటించాలని సూచించారు. ● అంటు వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని జొన్నగురకల గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని వ్యాధులు సోకకుండా చూడాలన్నారు. గర్భవతులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. తాజా ఆకు కూరలు, కూరగాయలు తీసుకోవాలని సూచించారు. అనంతరం రోగులకు వైద్య పరీక్షలు చేయించారు. సీహెచ్ఓ రాజామణి, హెల్త్ అసిస్టెంట్‌లు శ్రీనివాసులు, సుబ్రమణ్యంరెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న పీరూసా హెబ్

గుడిపాల: డెంగీ జ్వరంపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ పీరూసా హెబ్ అన్నారు. గురువారం వసంతాపురం వెల్‌నెస్ సెంటర్‌లో డెంగీ వ్యతిరేక మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డెంగీ రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఇంటి చుట్టుపక్కల పరిసరాలలో వ్యర్థమైన కొబ్బరి చిప్పలు, పాడైన టైర్లలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ప్రత్యేకంగా ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించాలన్నారు. ఎవరికైనా జ్వరం వస్తే వెంటనే దగ్గర్లో ఉన్న ప్రభుత్వాస్పత్రిలో రక్త పరీక్ష చేసుకుని డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి సంధ్య, సూపర్‌వైజర్ విజయ, జబ్బా, చంద్ర, ఉమ, స్వప్న పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలపై అవగాహన



కాణిపాకం పట్నం హైవే బ్రిడ్జి దగ్గర వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

తవణంపల్లె: రోడ్డు భద్రత నియమాలపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నట్లు తవణంపల్లె ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు. గురువారం సాయంత్రం మండలంలోని కాణిపాక పట్నం హైవే బ్రిడ్జి దగ్గర వాహనాలను తనిఖీ చేశారు. రోడ్డు భద్రత నియమాలు, వేగనియంత్రణపై వాహనాదారులకు అవగాహన కల్పించారు. వాహనదారులు ట్రాఫిక్ కొత్త నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలన్నారు. వాహనాల తనిఖీలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

కాణిపాకం: పూతలపట్టు నియోజకవర్గంలో పలు గ్రామాల్లో నివాసాలపై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లను వెంటనే తొలగించాలని విద్యుత్ శాఖ అధికారులకు పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం చిత్తూరులోని ఓ ప్రైవేటు హోటల్లో పూతలపట్టు నియోజకవర్గం విద్యుత్ శాఖ అధికారులతో ఎమ్మెల్యే సమీక్షించారు. ఐదు మండలాల విద్యుత్ శాఖ అధికారులతో విద్యుత్ సమస్యలపై చర్చించి, పలు సలహాలు, సూచనలు చేశారు. పలు గ్రామాల్లో నివాసాలపై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లను వెంటనే తొలగించాలన్నారు. మరమ్మతులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే బాగు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈ హరి, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

బీసీజీ వ్యాక్సినేషన్ పరిశీలన



వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న టీబీ జాయింట్ డైరెక్టర్ రమేష్‌బాబు

గంగవరం: మండలంలోని కొత్తపల్లె హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లో అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని టీబీ జాయింట్ డైరెక్టర్ రమేష్ బాబు, జిల్లా టీబీ నియంత్రణ అధికారి వెంకటప్రసాద్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి పీహెచ్‌సీ స్థాయిలో ఇప్పటి వరకూ 50 శాతం పైగా వ్యాక్సిన్ వేసినట్టు తెలుసుకున్నారు. గ్రామాల్లో బీసీజీ వ్యాక్సిన్ అవసరమైన ప్రజలను గుర్తించి తప్పనిసరిగా వేయాలని ఆదేశించారు. దీనిని అందరూ బాధ్యతగా తీసుకుని మండలం వ్యాప్తంగా వంద శాతం వ్యాక్సినేషన్ పూర్తి చేయాలన్నారు. వైద్యాధికారి శ్రీనివాసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మొండి.. పాతబండి!

- పాత వాహనాలు విక్రయిస్తే జాగ్రత్తలు తప్పనిసరి
- కొన్నవారి పేరుతో రిజిస్ట్రేషన్ చేయించండి
- లేదంటే తిప్పలు తప్పవంటున్న ఆర్టీఏ అధికారులు



ద్విచక్రవాహనాలు

కాణిపాకం: కొత్త వాహనాల కొనుగోళ్లు పెరుగుతున్నాయి. అదే స్థాయిలో పాత వాహనాల విక్రయాలు కూడా జరుగుతున్నాయి. అయితే పాత వాహనాలను విక్రయించిన వారు కొనుగోలు చేసిన వారి పేరుతో రిజిస్ట్రేషన్ చేయించడం తప్పనిసరి. తెలిసిన వాళ్లనో, మరే కారణంతోనే రిజిస్ట్రేషన్ చేయించడం నిర్లక్ష్యం చేస్తే ఆ తర్వాత ఇబ్బందులు పడాల్సి వస్తుందని పోలీసు అధికారులు హెచ్చరిస్తున్నారు. చిత్తూరు, పూతలపట్టు పరిధిలో 1.70 లక్షల జనాభా ఉండగా.. ప్రతి ఇంట్లో కనీసం రెండు వాహనాలు వాడుతూ ఉంటారు. ఈ లెక్కన ఎంత లేదన్నా సరాసరి 75 వేల వాహనాలు ఉండొచ్చని ఆర్టీఏ అధికారుల అంచనా.

మార్పు తప్పనిసరి

పట్టణాలతో పాటు ఇటీవల మండలాల స్థాయిలో పాత వాహనాల క్రయవిక్రయాలు జోరుగా సాగుతున్నాయి. వాహనం అమ్మిన వెంటనే వాహనదారుడు కొనుగోలుదారుడి పేరుపై రిజిస్ట్రేషన్ చేయించాలి. లేకుంటే పోలీసుల చేత ఇబ్బందులు పడాల్సి వస్తుంది. కొనుగోలుదారుడు ఎక్కడైనా వాహనాన్ని యాక్సిడెంట్ చేసినా, అక్రమ మద్యం తరలిస్తున్నా, మైనర్‌కు వాహనం ఇచ్చి నడిపించినా, ఆ సమయంలో ప్రమాదం జరిగినా, రాంగ్ డ్రైవింగ్ చేసినా, నోపార్కింగ్ స్థలంలో పార్కింగ్ చేసినా విక్రయదారుడిపై కేసులు నమోదు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇక వాహనం పాత యజమాని వద్ద ఉన్నప్పుడు చేసిన నేరాల అంశాలకు కొత్త యజమానికి తిప్పలు తప్పవు. కోర్టుల చుట్టూ తిరిగి అనవసరమైన సమయాన్ని వృథా చేసుకోవాల్సి వస్తుంది. రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు ఆలస్యమైతే కనీసం సేల్‌డీడ్ అయినా రాయించుకోవాలి.

జోరుగా బేరాలు..

పట్టణాలతో పాటు ఇటీవల మండలాల స్థాయిలో పాత వాహనాల క్రయవిక్రయాలు జోరుగా సాగుతున్నాయి. మధ్యవర్తుల ఆధ్వర్యంలో ఇష్టం వచ్చినట్లు క్రయవిక్రయాలు సాగిస్తున్నారు. వాహనం కొనుగోలుదారుడు వాహనంపై పెండింగ్ కేసులు, చలానాలు ఉన్నాయో లేదో చూసుకోకుండా కొనుగోలు చేయడం వల్ల తర్వాత ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఒక్కోసారి పాత కేసులుగానీ, చలానా గానీ తానే భరించాల్సి వస్తుంది.

29, 30 ఫారాలే ముఖ్యం..

వాహనాలు కొన్న వెంటనే ఆర్సీ, బీమా, కాలుష్యం, చిరునామా ధ్రువీకరణ పత్రాలపై సంతకాలు చేసుకోవడం ముఖ్యమని సంబంధిత అధికారులు సూచిస్తున్నారు. వాటితో పాటు ఫారం–29 రెండు కాపీలు, ఫారం–30పై విక్రయించిన వారి సంతకాలు తీసుకుంటే యాజమాన్య హక్కుల బదిలీ సులభమవుతుంది. పాత వాహనాలు అమ్మేశాక యాజమాన్య హక్కులు బదిలీ చేసుకోకపోతే కష్టాలు తప్పవు. కొత్తగా మరోవాహనం కొన్నప్పుడు అదనపు ఇబ్బందులు, ట్యాక్స్‌లు ఎదురు కావు. ఈ విషయంపై అవగాహన లేకపోవడంతో పలువురు ఎక్కువ పన్ను చెల్లిస్తూనే ఉన్నారు. ఇకనైనా వాహనాన్ని అమ్మిన వెంటనే ఇరువైపులా యాజమాన్య హక్కులను స్పష్టంగా మార్చుకోవాలని రవాణాశాఖ అధికారులు సూచిస్తున్నారు.

కొనుగోలుదారుడి పేరుపై రిజిస్ట్రేషన్ తప్పనిసరి



పాతవాహనాలు అమ్మిన వెంటనే కొనుగోలుదారుడిపై రిజిస్ట్రేషన్ చేయించాలి. లేదంటే కొనుగోలుదారుడు వాహనాన్ని అడ్డుపెట్టుకుని అక్రమ పనులు చేపడితే అమ్మిన వాహనదారుడిపైనే కేసులు నమోదవుతాయి. పాత వాహనాలు కొన్న వెంటనే ఫారం–29, 30 విక్రయించిన వారి సంతకాలు తీసుకుంటే యాజ మాన్య హక్కుల బదిలీ సులభమవుతుంది. తప్పనిసరిగా ఇరువైపులా యాజ మాన్యులు జాగ్రత్తలు పాటించాలి. లేనిపక్షంలో ఇబ్బందులు తప్పవు.

– నిరంజన్‌రెడ్డి, డీటీసీ, చిత్తూరు

టీచ్ టూల్ శిక్షణ ఉపయోగకరం



టీచ్ టూల్ శిక్షణను పరిశీలిస్తున్న డీఈఓ

నగరి: టీచ్ టూల్ కార్యక్రమం ఎంతో ఉపయోగకరమని డీఈఓ దేవరాజులు అన్నారు. గురువారం నగరి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న టీచ్ టూల్ శిక్షణను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ బోధనా నైపుణ్యాలను మెరుగుపరచడానికి తద్వారా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి టీచ్ టూల్ కార్యక్రమం ఎంతగానో తోడ్పడుతుందన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంఈఓలు శ్రీదేవి, నమశ్శివాయం, ఏఎంఓ పల్లవి, టీచ్ టూల్ కోఆర్డినేటర్ నాగేంద్ర, ప్రేమ్, విషయ నిపుణులు నాదముని, ఈశ్వరయ్య, కోదండయ్య, శరవణ, వసంత పాల్గొన్నారు.

ఆరిమాని గంగమ్మ హుండీ లెక్కింపు



హుండీ కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

శ్రీరంగరాజపురం: మండలంలోని తయ్యూరు పాయికట్టు ఆరిమానిగంగమ్మ ఆలయ హుండీని గురువారం ఈఓ తిమ్మరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తుల సమక్షంలో లెక్కించారు. ఈఓ మాట్లాడుతూ భక్తులు అమ్మవారికి 2024 మార్చి నెల నుంచి ప్రస్తుతం వరకు అమ్మవారికి సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.2 లక్షల 24,808 నగదు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. హుండీ ఆదాయాన్ని బ్యాంక్‌లో జమచేశామన్నారు. ఆలయ చైర్మన్ లింగరెడ్డి, సర్పంచ్ లక్ష్మమ్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.